క్లుప్తంగా

నేడే పోస్టల్ బ్యాలెట్

పార్వతీపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది పోస్టల్ బ్యాలట్ విధానంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి హేమలత అన్నారు. ఫారం–12, 12డీ సమర్పించిన ప్రభుత్వ ఉద్యోగులకు పట్టణంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇతర జిల్లాల్లో ఓటు కలిగి, ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు ఈనెల 5, 6 తేదీల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

- పార్వతీపురం నియోజకవర్గంలో ఓటు హక్కు కలిగి ఉండి ఫారం–12 సమర్పించి ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు(పీఓ, ఏపీఓ, బీఎల్ఓ, ఇతర ఎన్నికల సిబ్బంది) పార్వతీపురం గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన నాలుగు ఫెసిలిటేషన్ సెంటర్లలో ఈనెల 5న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్యలో వారి ఓటరు కార్డు లేదా ఏదైనా గుర్తింపు కార్డుతో పాటు ఎలక్షన్ ఆర్డర్‌తో హాజరై పోస్టల్ బ్యాలట్‌ను వినియోగించుకోవాలని కోరారు.

ఏ నియోజకవర్గంలో ఓటు ఉంటే అక్కడే పోస్టల్ బ్యాలెట్

పార్వతీపురం: జిల్లాలో ఓటు కలిగి ఉండి జిల్లాలో ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు వారి సొంత నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు వారి సొంత నియోజక వర్గాల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఇతర జిల్లాల్లో ఓటు హక్కు ఉన్న వారు, ఈ జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులకు మే 5,6 తేదీల్లో ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకొనేందుకు శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఓటు హక్కు కొరకు ఫారం 12, ఫారం 12డి సమర్పించిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

మాక్ పోలింగ్ పరిశీలన



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్వో విష్ణుచరణ్

సాలూరు: సాలూరు అసెంబ్లీ ఎన్నికకు సంబంధించి శనివారం మాక్‌పోలింగ్ నిర్వహించారు. ఐటీడీఏ పీఓ, సాలూరు అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి విష్ణుచరణ్ పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ఏర్పాట్లు తనిఖీ చేశారు. ఈవీఎంలలో అభ్యర్థుల గుర్తుల లోడింగ్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న సీఐ రవికుమార్, ఎస్సై రాజేష్

సీతానగరం: ఈ నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సీఐ రవికుమార్ కోరారు. శాంతియుత వాతావరణంలో పోలింగ్ నిర్వహణే లక్ష్యంగా ప్రత్యేక బలగాలతో కలిసి పోలీసులు పలు గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించి ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని జానుమల్లువలస, గాదెలవలస, దయానిధిపురం గ్రామాల్లో ఎస్సై ఎం.రాజేష్ ఆధ్వర్యంలో శనివారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా నడుచుకోవాలని, ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కోరారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. గ్రామాల్లో గొడవలు సృష్టించేందుకు ప్రయత్నించేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, మినిస్ట్రీ ఆఫ్ ట్రైబుల్ అఫైర్స్ (స్కాలర్‌షిప్ సెక్షన్)నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లకు గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ట్రైబుల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 – 25 విద్యా సంవత్సరానికి విదేశాలలో పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టోరల్ రీసెర్చ్ ప్రోగ్రాంకుగాను ఎస్టీ అభ్యర్థుల 20 మందిని ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీ ఓవర్సీస్.ట్రైబుల్.గవ్.ఇన్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు గిరిజన సంక్షేమ, సాధికారిత అధికారిని సంప్రదించాలని సూచించారు.

ఏజెన్సీలో ప్రగతి బాటలు



మావుడి కొత్తవలస వద్ద బీటీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర (ఫైల్)

గతంలో రాళ్ల దారిలో నడిచేవాళ్లం



గతంలో రాళ్లు తేలిన రోడ్డుపై నడిచేవాళ్లం. జగనన్న పుణ్యమా అని నేడు తారురోడ్డుపై ప్రయాణం చేస్తున్నాం. ఎన్నో ఏళ్ల కల నెరవేరింది. మాకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు మా ఊరుకి బీటీరోడ్డు నిర్మించడం ఆనందంగా ఉంది. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మాకు, మా ఊరికి మంచి చేసిన జగనన్న, రాజన్న రుణం తీర్చుకుంటాం.

– తాడంగి సుధ, కె.కొత్తవలస గ్రామం, సాలూరు మండలం

- బీటీ రోడ్లుతో కళకళలాడుతున్న గ్రామాలు
- జగనన్న పాలనలో తీరిన రహదారి కష్టాలు

సాలూరు రూరల్: ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధిపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దృష్టిసారించింది. 2019–24 మధ్య కాలంలో సాలూరు నియోజకవర్గంలో సుమారు రూ.1200 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టింది. రోడ్డు మార్గం లేని మారుమూల గ్రామాలకు బీటీరోడ్డు సౌకర్యం కల్పించింది. గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి కుళాయిలు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తూ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. నియోజకవర్గంలోని ఏజెన్సీ గ్రామాల్లోని మట్టిరోడ్లు నేడు బీటీరోడ్లుగా మాయిపోయాయి. గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి, సంక్షేమం జగనన్న ప్రభుత్వంలో జరిగిందని ప్రజలు చెప్పుకోవడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సుపరిపాలనకు నిదర్శనం.



మామిడిపల్లి-శంబర బీటీరోడ్డు



జాతీయ రహదారి నుంచి కరడవలసకు వేసిన బీటీరోడ్డు

సాలూరు మండలంలో రహదారుల నిర్మాణం ఇలా..

- మండలంలో చింతలవలస నుంచి డొంకల వెలగవలస గ్రామానికి రూ.66.26 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం
- కందులపదం నుంచి తీన్‌సామంతవలసకు రూ.82.36 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం
- కందులపదం ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి అన్నంరాజువలసకు రూ.175 లక్షలతో బీటీరోడ్డు నిర్మాణం
- నంద నుంచి మడవలసకు రూ.120 లక్షలతో బీటీరోడ్డు నిర్మాణం
- శంబర బీటీరోడ్డు నుంచి ముచ్చర్లవలసకు రూ.30 లక్షలతో బీటీరోడ్డు సౌకర్యం
- పెదపదం నుంచి పాలమామిడివలసకు రూ.35.63 లక్షలతో బీటీరోడ్డు నిర్మాణం
- కొత్తవలస నుంచి బుట్టిగానివలసకు రూ.61.16 లక్షలతో బీటీ రోడ్డు సదుపాయం
- పెదపదం నుంచి పెద్దవలస రూ.90 లక్షలతో బీటీరోడ్డు నిర్మాణం
- మామిడిపల్లి శంబర రోడ్డు నుంచి లక్ష్మీపురం వరకు రూ.150 లక్షలతో బీటీరోడ్డు ఏర్పాటు
- పారన్నవలస కూడలి నుంచి భవానీపురం వరకు రూ.90 లక్షలతో బీటీరోడ్డు నిర్మాణం
- జాకరవలస, మిర్తిగుడ్డివలస, అన్నం రాజువలస, కరడవలస, ముంగివానివలస, పనసవలసతో పాటు పలు ఏజెన్సీ గ్రామాలకు కోట్లాది రూపాయల నిధులతో బీటీరోడ్లు నిర్మాణ పనులు చేపట్టారు.
- అలాగే రూ.399 లక్షలతో కాసాయివలస, పులివలస, ఎం.కొత్తవలస, ఇటికవలస గ్రామాలకు బీటీరోడ్లు నిర్మానానికి డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర గత నెలలో శంకుస్థాపనలు చేశారు. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి.



బూర్జివలస -కె.కొత్తవలస బీటీరోడ్డు



మామిడిపల్లి నుంచి దండిగాం వరకు నిర్మించిన రోడ్డు



గంగన్నదొరవలస నుంచి తోణాం, దిగువ మెండంగి వెళ్లే రోడ్డు

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: భద్రగిరిలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి గాను 3వ తరగతితో పాటు 4 నుంచి 9వ తరగతి వరకు ఉన్న మిగులు సీట్లలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ శనివారం ప్రకటనలో తెలిపారు. 3వ తరగతిలో 80 సీట్లు, 4వ తరగతిలో 5 సీట్లు, 8,9వ తరగతుల్లో ఒక్కో సీటు చొప్పున ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 20లోగా భద్రగిరి గురుకులంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు..

ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ విద్యాలయంలో 2024–25 విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం (ఆంగ్ల మాధ్యమం)లో ప్రవేశాలకు ఈనెల 18లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ తెలిపారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు ఆన్‌లైన్ (డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ ఏపీటీడబ్ల్యూ.గురుకులం.ఏపీ.జీఓవీ.ఇన్)లో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. కురుపాం, పాటికొంట, అనసభద్ర, గుమ్మలక్ష్మీపురం ఏకలవ్య కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో 30 సీట్లు చొప్పున అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

మినీ గురుకులంలో..

పాచిపెంటలోని మినీ గురుకులంలో 2024–25 విద్యాసంవత్సరానికి 1వ తరగతి ప్రవేశానికి, 2వ తరగతి నుంచి 7వ తరగతి వరకు మిగులు సీట్లలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. 1వ తరగతిలో 30 సీట్లు, 2వ తరగతిలో 11సీట్లు, 7వ తరగతిలో 2 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఆసక్తి ఉన్న గిరిజన విద్యార్థులు ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పార్వతీపురం: మండలంలోని సంగంవలస గ్రామానికి చెందిన తెంటు సింహాచలంకు ఇటీవల బ్రెయిన్‌కు సంబంధించిన ఆపరేషన్ జరిగింది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గంట రామకృష్ణ, బడే శ్రీరంజన్, డొంకాడ శ్రీరామ్మూర్తి, కోడి వెంకటనాయుడు, కిన్నెర కాంత సంఘం తదితరులు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. దాతలు ముందుకొచ్చి నిరుపేద అయిన సింహాచలానికి ఆర్థిక సాయం చేయాలని కోరారు.

ఊపందుకున్న రబీ వరి కోతలు

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురం, గవరమ్మపేట, సుభద్రమ్మవలస గ్రామాలలో రబీ వరి ఉభాలు ఊపందుకున్నాయి. శనివారం ఒక్క రోజే మూడు కోత మిషన్లతో వరికోతలు కోశారు. దిగుబడులు కూడా బాగా రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రబీ పంట ఎకరాకు 32 బస్తాల దిగుబడి వచ్చిందని రైతులు చెప్పారు.

వలంటీర్ల రాజీనామా

పార్వతీపురంటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి, మళ్లీ ఆయన సారథ్యంలో సంక్షేమ ప్రభుత్వం రావాలని కోరుకుంటూ మండంలోని వలంటీర్లు రాజీనామా చేస్తున్నారు. శనివారం బాలగుడబ, తామరకండి గ్రామ సచివాలయం పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావుని మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ.. కష్టపడి పనిచేసి మళ్లీ మన ప్రభుత్వం తెచ్చుకునేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పందు, మాజీ సర్పంచ్ మువ్వల సత్యంనాయుడు, వైస్ సర్పంచ్ వి.శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ మూడడ్ల మన్మథరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే జోగారావును మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు తెలపిన వలంటీర్లు

జోరందుకున్న ప్రచారం

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు కొన్నిరోజులు మాత్రమే మిగిలి ఉండడంతో పార్వతీపురం, సాలూరు నియోజకవర్గాల్లో ప్రచారం జోరందుకుంది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల తరఫున ఆ పార్టీ నాయకులు శుక్రవారం పలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి గత టీడీపీ ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనకు మధ్య తేడాను వివరించారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ జగనన్న ప్రభుత్వం అధికారంలోకి రావాలని, అందుకోసం రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



సాలూరు: పట్టణంలోని 16వ వార్డులో ఎమ్మెల్యే జోగారావుకు మద్దతుగా ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ రాపాక మాధవరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు



సీతానగరం: అప్పయ్యపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న సచివాలయ కన్వీనరు బి.సూర్యనారాయణ



సీతానగరం: మండల కేంద్రంలోని సుంకరివీధిలో ఇంటింటి ప్రచారంలో మాజీ సర్పంచ్ లంక లక్ష్మి, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు



మక్కువ: కొండబుచ్చమ్మపేటలో రాజన్నదొరకు మద్దతుగా ప్రచారం చేస్తున్న మావుడి సోదరులు



సాలూరు రూరల్: కూర్మరాజుపేట పంచాయతీ పునికినివలసలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు కిలపర్తి మన్మథ, తదితరులు



సాలూరు రూరల్: పురోహితునివలసలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, మహిళలు



సాలూరు రూరల్: తోణాం శనివారం సంతలో రాజన్నదొరకు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మళ్లీ వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే..



చిన్నబొండపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జోగారావుకు హారతిచ్చి స్వాగతిస్తున్న మహిళలు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పాలన అందించిందని, రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే వస్తుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని వెంకంపేట, చినబొండపల్లి గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులు ఆయనకు పూలమాలలతో స్వాగతం పలికారు. మహిళలు హారతులు ఇచ్చి ఆశీర్వదించారు. వందలాది మంది కార్యకర్తలు, ప్రజలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, ఎంపీపీ మజ్జి శోభారాణి, వైస్ ఎంపీపీలు సిద్దా జగన్నాథరావు, బి.రవికుమార్, స్థానిక సర్పంచ్‌లు తీళ్ల కృష్ణారావు, గండి శంకరరావు, పీఏసీఎస్ చైర్మన్ తీళ్ల శివున్నాయుడు, ఎక్స్ సర్పంచ్ తీళ్ల సుభద్రమ్మ, సీనియర్ నాయకులు పేరే పాత్రుని భాస్కరరావు (మధు), మిరియాల కామేష్, భవిరిపూడి మన్మధరావు, భవిరిపూడి పోలినాయుడు, వెంగల శ్రీధర్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చినబొండపల్లి గ్రామంలో ఎమ్మెల్యే జోగారావుతో పాటు ప్రచారంలో పాల్గొన్న గ్రామస్తులు, నాయకులు

టీడీపీ మేనిఫెస్టో చూసి మోసపోవద్దు



పనుకువలసలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరకు హారతులు ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

పాచిపెంట: టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో చూసి ప్రజలు మరోసారి మోసపోవద్దని డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ సాలూరు అసెంబ్లీ అభ్యర్థి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలో పనుకువలస, పి.కోనవలస, కర్రివలస, మంచాలవలస పంచాయతీలో శనివారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు తమ అభిమాన నాయకుడు రాజన్నదొరకు పూలమాలలు వేసి, హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం రాజన్నదొర స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో అందించిన సంక్షేమాన్ని, అభివృద్ధిని వివరించారు. 2014 ఎన్నికల్లో 600 హామీలు ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని, ఇప్పుడు అవే హామీలతో మరోసారి ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నాడని దుయ్యబట్టారు. టీడీపీ మేనిఫెస్టో చూసి మోసపోవద్దని ప్రజలను కోరారు. ప్రజాసంక్షేమ పాలన అందించిన సీఎం జగన్‌కు ప్రతి ఒక్కరూ మద్దతివ్వాలని కోరారు. రానున్న ఎన్నికల్లో మీరంతా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా నన్ను, ఎంపీగా తనూజారాణిని గెలిపించాలని, జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు బడ్నాన ప్రమీల, గొట్టాపు ముత్యాలనాయుడు, పాచిపెంట వీరంనాయుడు, డోల బాబ్జి, టి.గౌరీశ్వరరావు, కె.పెద్దిబాబు, కె.రవీంద్ర, ఎస్.నారాయణరావు, సీతారం, కొండలరావు, ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



పెదచీపురువలసలో ఎన్నికల ప్రచారం చేస్తున్న పీడిక రాజన్నదొర

టీడీపీ చేరిన గంటలోపే వైఎస్సార్‌సీపీలో చేరిక



జమ్మయ్యకు టీడీపీ కండువా వేస్తున్న సంధ్యారాణి



వెంటనే వైఎస్సార్‌సీపీ కండువా వేస్తున్న స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు దండి కొండలరావు

- ఖంగుతిన్న టీడీపీ నాయకులు

పాచిపెంట: టీడీపీ ప్రచార ఆర్భాటం గంటలోనే ఆవిరైన సంఘటన మండలంలోని కర్రివలస పంచాయతీలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కర్రివలస పంచాయతీ సీతంపేటలో శుక్రవారం ఎన్నికల ప్రచారానికి వచ్చిన టీడీపీ అభ్యర్థి సంధ్యారాణి, గ్రామానికి చెందిన జట్ల జమ్మయ్యకు స్థానిక నాయకుల ఆధ్వర్యంలో టీడీపీ కండువా వేశారు. అయితే తనకు టీడీపీలో చేరడం ఇష్టంలేదని, వెంటనే తనకు వైఎస్సార్‌సీపీ కండువా వేయాలని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు దండి కొండలరావు వద్దకు వెళ్లాడు. టీడీపీ కండువా వేసిన 15 నిమిషాల వ్యవధిలోనే వైఎస్సార్‌సీపీలో చేరడంతో అక్కడి టీడీపీ నాయకులు ఖంగుతిన్నారు. టీడీపీ ప్రచార యావకు, చేరికలంటూ ఆ పార్టీ నాయకులు చేస్తున్న ఉత్తుత్తి ప్రచారం బయటపడిందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఆన్ జాబ్ ట్రైనింగ్‌కు ఆర్ఐటీఐ విద్యార్థులు



నెల్లూరులో ఆన్ జాబ్ ట్రైనింగ్‌లో ఉన్న భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐ విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐకు చెందిన సీనియర్ విద్యార్థులను ఆన్ జాబ్ ట్రైనింగ్ నిమిత్తం నెల్లూరులోని ప్రభుత్వ ఆర్ఐటీఐకు పంపించినట్టు ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. వెల్డర్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మోటర్ మెకానిక్ ట్రేడులకు చెందిన విద్యార్థుల నైపుణ్యాన్ని మెరుగుపర్చేందుకు ప్రభుత్వం ఆదేశాల మేరకు ఓజేటీ నిమిత్తం పంపించడం జరిగిందని, వారికి 3 నెలల పాటు ఆయా చోట్ల శిక్షణ అందించిన అనంతరం వారికి ఉద్యోగావకాశాలు కూడా కల్పించడం జరుగుతుందన్నారు.